


(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

## -178-

(8 మే 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ఈనాటి సంఘంలో** మోసం విశ్వరూపం దాల్చింది. దాన్నుంచి తప్పించుకోవడం ఎవరికి చేతకావడంలేదు. ఎదుటి వ్యక్తి మోసం చేస్తున్నాడని తెలిసికూడా ఒక్కొక్కప్పుడు అతణ్ణి మందలించడానికిగాని, ఆ మోసం నుంచి తప్పించుకోవడానిగ్గానీ అవకాశం వుండటంలేదు.

ఎక్కడికి వెళ్ళినా మోసం, ఎటు చూసినా మోసం, ఎవర్ని పలకరించినా మోసం, ఏ వ్యాపారంలోకి దిగినా మోసం, ఏ బంధుత్వంలోకి దిగినా మొసం, కొనబోతే మోసం, తినబోతే మోసం, ప్రయాణాలలో మోసం, ప్రణయాలలో మోసం..

'మోసమయా గరుడమోసమయా!

లోకమంతా వట్టి

మోసమయ్యా గురుడ

మోసమయ్యా

అంగట్లో మోసాలు

పెళ్ళి పందిట్లో మోసాలు..

ఆఫీసుల్లో మోసాలు

ఆశ్రమాలలో మోసాలు

ఆశ్రయిస్తే మోసాలు

ఏది వద్దుర బాబు!

ఈ బ్రతుకు జాలంలో

విశ్రమించినగాని

వెంటాడు మోసాలు.

మోసమయ్యా బాబు!

మోసమయ్యా

పై పెచ్చు రోసమయ్యా బాబు!

రోసమయ్య

ఈ పాట బట్టీపట్టి పాడుకుంటూ తిరగవలసిన కాలం వచ్చింది. మనకు బోలెడు తెలివితేటలున్నాయి. ఎవడు మోసం చేస్తాడు? అని గర్వంగా తిరగడానిక్కూడా అవకాశాలు లేవు. ఎంత తెలివిగల వాడికైనా ఎత్తి దూరంగా గిరాటు వేయగల శక్తులుంటాయి. మోసగాళ్ళ దగ్గర వాళ్ళకు తట్టినన్ని ఉపాయాలు, ఊహలూ ఎక్కడా, ఎవరికీ ఉండవు హఠాత్తుగా తడుతుంది వాళ్ళకు ఉపాయం. వెంటనే జరుగుతుంది మోసం.. ఎవడికో పాపం అపాయం.

మోసాల్లో ఎన్నెన్ని రకాలు. వాటిని గురించి ఒక పెద్ద గ్రంథం వ్రాయవచ్చు, క్రోడీకరించే ఓపిక వుంటే. ఉదాహరణకు కొన్ని మాత్రం పేర్కొనగలం.

ఇటీవల మా బంధువుల్లో ఒక ముసలాయన గుంటూరు వెళ్ళారుట. ఆయనగారు రోడ్డు వెంట వెడుతుంటే ఒక వ్యక్తి పలకరించి "ఎక్కడిదాకా వెళ్ళాలి మీరు?" అన్నాడుట. ఆయనగారేదో పేట పేరు చెప్పారు. 'అలాగా మేమూ అక్కడికే వెడుతున్నాం', అని అక్కడ వున్న జీప్ ఒకటి చూపించాడుట.

"దీంట్లో వెడదాం" అన్నాడుట.

తర్వాత "మీరెంత సేపటికి బయలుదేరతారో నేను తొందరగా వెళ్ళాలి" అన్నాడుట ఆ ముసలాయన.

"లేదండీ! ఇప్పుడే వెళ్ళిపోదాం. మా వాళ్ళు బంధువుల్ని రైలెక్కించడానికి వెళ్ళారు. రాగానే వెళ్ళిపోదాం. పెద్దలు మీరు నడవడమెందుకు ఎండలో. మీరు జీప్‌లో వస్తే మాకేం నష్టం" అన్నాడుట.

ముసలాయన మెత్తపడ్డారు. అక్కడే నుంచున్నారు. ఇంతలో మరో వ్యక్తి వచ్చి అక్కడవున్న వ్యక్తితో "ఏం చెయ్యమన్నావురా? రైలు స్టేషనులో వందరూపాయల చిల్లరలేదు. టిక్కెట్టు ఎలా కొనేది" అన్నాడుట.

మొదటి వ్యక్తి ముసలాయన వంక చూచి రైలు స్టేషన్‌లోనే చిల్లరలేదుట మీ దగ్గర ఓ పదిరూపాయలుంటే ఇవ్వండి ఆపైన మా వాళ్ళ కాఫీ హోటల్ వుంది అక్కడ మార్చి ఇస్తాం అన్నాడుట.

ముసలాయన "నా దగ్గర పదిరూపాయలు లేవు అయిదే వున్నాయి" అన్నాడుట.

"పోనీ అంతే ఇవ్వండి. మార్చి ఇస్తాం" అని తీసుకుని ఆ నోటు రెండోవాడి చేతిలో పెట్టి "టిక్కెట్టు కొని ఇచ్చిరా త్వరగా పోదాం" అన్నాడుట. రెండోవాడు వెళ్ళిపోయాడు. ఆ మొదటి వ్యక్తి ముసలాయన్ని "మీరు జీపులో కూర్చోండి ఎండలో దేనికి?" అని లోపల కూర్చోపెట్టాడుట.

పది నిముషాలైనా రెండో వ్యక్తి రాలేదు వాణ్ణి పిలుచుకు వస్తానని మొదటి వ్యక్తి వెళ్ళిపోయాడుట. ముసలాయన సంచి చేత్తో పట్టుకుని ఠీవిగా కూర్చున్నాడుట. ఇంతలో ఒక డ్రైవర్ వచ్చి "ఎవరు నువ్వు ఇందులో కూర్చున్నావు? దిగు దిగు" అని డబాయించాడుట.

ముసలాయన ఖంగారుపడి అయిదు రూపాయల సంగతి చెప్పేశాడుట.

"ఆ సంగతి నాకేం తెలియదు. వాళ్ళెవరో మిమ్మల్ని మోసం చేశారు. ఇది ఆఫీసరుగారి జీపు. ఇక్కడ ఆపి నేను లోపలకి వెళ్ళాను. దిగు ఆఫీసరుగారు బయలుదేరుతున్నారు" అన్నాడుట.

ముసలాయనకు మూర్ఛ వచ్చినంత పని అయింది. ఏం చెప్పాలో తోచక, ఏం చేయాలో తోచక, దిగులు పడుతూ దిగి ఇంటికి చేరాడట. పది నిమిషాలు జీపులో కూర్చున్న సుఖానికి అయిదు రూపాయిలు వదిలిపోయాయి. జీపు కోసం ఆశపడ్డందుకు, జేబు ఖాళీ అయింది పాపం! ఎంత మోసం.

ఇలాంటి బజారు మోసాలెన్నో జరుగుతూ వుంటాయి ప్రతి నిత్యం. పెద్ద మనుష్యులలాగా వచ్చి మోసం చేసి సొమ్ము గుంజుకుంటూ వుంటారు. పాపభీతి వుండదు. మానవ జన్మకు అవసరమైన నీతీ వుండదు.

మొన్న రైలు స్టేషను దగ్గర ఒక ముసలమ్మ టిక్కెట్టు కోసం నుంచుంటే ఒక యువకుడు పెద్దమనిషి డ్రస్సులో కనిపించి "అవ్వా! నువ్వు తంటాలు పడలేవు. టిక్కెట్టు నే తెచ్చిపెడతా ఇక్కడ కూర్చో"మని చెప్పి ఒక కాగితాల కట్ట ఆవిడ దగ్గిర పెట్టి పదిరూపాయల నోటు తీసుకుని వెళ్ళాడుట.

ఆవిడ ఎంతో సేపు ఎదురు చూసిందట. చివరకు మొత్తుకుని కేకలు పెట్టిందట. కాగితం పొట్లం వుంది గనక తప్పకుండా వస్తాడనుకున్నాను అని గోల పెట్టింది. అక్కడ వున్న పెద్ద మనుష్యులు ఆ కాగితాలు విప్పి చూస్తే పది పాత పత్రికలున్నాయట అందులో. 'అవి పది రూపాయలకు బదులు ఒక పావలా వస్తుందమ్మా' ఇవి అమ్మితే అన్నారుట.

ఆవిడ దగ్గర ఆనోటు తప్ప డబ్బు లేదు. అందరికి తను మోసంలో పడటం మాట చెప్పి సహాయం అడిగిందిట. వారంతా ఆవిడ చేసేదే మోసమని తిట్టి చక్కా పోయారుట.

ఇటీవల ఒకాయన నెల్లూరులో రైలు దిగాడట తెల్లవారు ఝామున. ఒక వ్యక్తి వచ్చి "రిక్షా వుందండి రండి" అని సూట్‌కేసు చేత్తో పుచ్చుకున్నాడుట.

"నేను ఫలాన పేటకు వెళ్ళాలి ఎంత?" అన్నాడట ఆయన.

"మీ యిష్టం వచ్చినంత ఇవ్వండి. మీతో బేరమేమిటి? పదిపైసలు తగ్గితే మాత్రమేం హెచ్చితే మాత్రమేం" అని అతగాడు సూట్‌కేస్ పుచ్చుకుని బయటికి రివ్వున వెళ్ళాడుట.

ఆ పెద్దమనిషి బైటికి వెళ్ళి వెతికితే ఆ వ్యక్తి ఎక్కడా కనపడలేదుట. రెండు గంటలు వెతికాడుట. సూట్‌కేస్‌లో వెయ్యి రూపాయిల సొత్తుందిట. మొత్తం కాజేశాడు ఆ మోసకారి.

Post your comments